సాంచా సప్పుళ్లు బంద్!

- సంక్షోభంలో వస్త్ర పరిశ్రమ
- పేరుకుపోయిన రూ.100 కోట్ల విలువైన పాలిస్టర్ నిల్వలు
- బతుకమ్మ, ఆర్వీఎం ఆర్డర్లపై అస్పష్టత
- బకాయిల ఊసెత్తని ప్రభుత్వం
- సిరిసిల్ల వస్త్ర పరిశ్రమ బంద్
- 20 వేలమంది కార్మికుల మెడపై కత్తి
- వస్త్ర పరిశ్రమకు ప్రభుత్వం అండగా నిలవాలి: మాజీ మంత్రి కేటీఆర్

కరీంనగర్, జనవరి 16 (నమస్తే తెలంగాణ ప్రతినిధి)/ రాజన్న సిరిసిల్ల(నమస్తే తెలంగాణ): తెలంగాణ ఏర్పాటు తర్వాత కళకళలాడుతూ, అలుపెరగక తిరుగుతూ కనిపించిన సిరిసిల్ల మరమగ్గాలు కళావిహీనమయ్యాయి. పని కరువై బూజుపట్టిపోతున్నాయి. పట్టణంలో గడగడపన వినిపించే మగ్గం చప్పుడు ఇప్పుడు చెవులు రిక్కించినా వినిపించడం లేదు. 30 వేల మరమగ్గాలు మూగబోవడంతో వాటినే నమ్ముకుని ప్రత్యక్షంగా, పరోక్షంగా జీవిస్తున్న 20 వేలమంది కార్మికుల పరిస్థితి ఇప్పుడు అగమ్యగోచరంగా మారింది. ఏటా నవంబర్, డిసెంబర్ నెలల్లో ఇవ్వాల్సిన రాజీవ్ విద్యామిషన్ (ఆర్వీఎం) ఆర్డర్లపై స్పష్టత లేకపోవడం, బతుకమ్మ చీరలకు సంబంధించి రూ. 200 కోట్ల బిల్లులు విడుదల చేయకపోవడంతోపాటు బతుకమ్మ చీరల కొత్త ఆర్డర్లపై ప్రభుత్వం నుంచి ఇప్పటి వరకు ఎలాంటి హామీ లేకపోవడం నేతన్నలను కలవరపాటుకు గురిచేస్తున్నది. వీటన్నింటికీ తోడు దాదాపు రూ.100 కోట్ల విలువైన పాలిస్టర్ వస్త్ర నిల్వలు పేరుకుపోవడం వారిని తీవ్ర ఆవేదనకు గురిచేస్తున్నది.

వస్త్ర పరిశ్రమ బంద్

కేసీఆర్ హయాంలో గడిచిన పదేండ్ల కాలంలో అభివృద్ధి పథాన సాగిన సిరిసిల్ల వస్త్ర పరిశ్రమ ప్రస్తుతం గడ్డు పరిస్థితి ఎదుర్కొంటున్నది. ప్రభుత్వం మారిన తర్వాత పలు అంశాలపై స్పష్టత లేకపోవడమే ఇందుకు కారణం. సంక్రాంతి పండుగ నుంచే పట్టణంలో సాంచాల సప్పుళ్లు బంద య్యాయి. ఆర్వీఎం యూనిఫాంల ఆర్డర్లు, బతుకమ్మ చీరలు వంటి ఆర్డర్లపై ప్రభుత్వం స్పష్టమైన హామీ ఇవ్వకపోవడంతో తప్పనిసరి పరిస్థితుల్లో బంద్‌కు పిలుపునిస్తున్నట్టు పాలిస్టర్ అసోసియేషన్ వెల్లడించింది. వినాయక చవితి, దసరా వంటి పండుగలు, శుభకార్యాల సమయంలో అలంకరణ కోసం వినియోగించే పాలిస్టర్ వస్త్రాల తయారీకి సిరిసిల్ల పెట్టింది పేరు. ఇక్కడ తయారయ్యే పాలిస్టర్ వస్త్రాలు చత్తీస్‌గఢ్, గుజరాత్, మహారాష్ట్ర, ఆంధ్రప్రదేశ్ సహా పది రాష్ర్టాలకు ఎగుమతి అవుతాయి. ప్రస్తుతం ఈ వస్త్రాలకు డిమాండ్ తగ్గడంతో దాదాపు రూ.100 కోట్ల విలువైన వస్త్రాలు పేరుకుపోయాయి.

ప్రభుత్వం నుంచి లేని స్పష్టత

వస్త్ర పరిశ్రమను ఆదుకొనే లక్ష్యంతో అప్పటి కేసీఆర్ ప్రభుత్వం 2016 నుంచి ప్రతి ఏటా నవంబర్, డిసెంబర్ నెలల్లో రాజీవ్ విద్యా మిషన్ (ఆర్వీఎం) కింద దుస్తుల తయారీ కోసం ఆర్డర్లు ఇస్తూ వచ్చింది. ఏటా రూ. 110 కోట్ల విలువైన ఆర్డర్లు ఇస్తూ నేతన్నల సంక్షేమానికి చర్యలు తీసుకున్నది. టెక్స్‌టైల్ పార్క్‌లో ఇటీవల మరమగ్గాలను నిలిపివేయడంతో ప్రభుత్వం స్పందించి రూ. 70 కోట్ల విలువైన ఆర్డర్లు ఇవ్వడంతో పనులు తిరిగి ప్రారంభమయ్యాయి. అదే సమయంలో సిరిసిల్లలోని పవర్‌లూంలను ప్రభుత్వం విస్మరించింది. దీనికితోడు ఏటా జనవరి, ఫిబ్రవరి నెలల్లో బతుకమ్మ చీరల కోసం ప్రభుత్వం ఇచ్చే దాదాపు రూ. 350 కోట్ల విలువైన ఆర్డర్లపైనా ప్రభుత్వం ఇప్పటి వరకు స్పష్టత ఇవ్వలేదు. సిరిసిల్లలో తాజా బంద్‌కు ఇది కూడా ఒక కారణం. బతుకమ్మ ఆర్డర్లకు సంబంధించి కార్మికులకు ప్రభుత్వం రూ. 200 కోట్ల బకాయి పడింది. సరిగ్గా చెల్లింపులు జరిపే సమయంలోనే ఎన్నికలు రావడంతో పేమెంట్ నిలిచిపోయింది. కష్టాలన్నీ అన్నివైపుల నుంచి ఒక్కసారే చుట్టుముట్టడంతో కార్మికులకు వేతనాలు ఇవ్వలేని పరిస్థితి నెలకొందని యజమానులు వాపోతున్నారు. చేసేది లేక మరమగ్గాలు మూసేయడంతో వాటినే నమ్ముకుని ప్రత్యక్షంగా, పరోక్షంగా జీవిస్తున్న దాదాపు 20 వేలమంది కార్మికులు పరిస్థితి అగమ్యగోచరంగా మారింది.

మీటరుకు రూపాయి నష్టం

పాలిస్టర్ వస్త్రాలకు మార్కెట్‌లో డిమాండ్ తగ్గింది. ఉన్న వస్త్రాలను అమ్మి కార్మికులకు ఉపాధి కల్పిద్దామంటే మీటరుకు రూపాయి నష్టం వస్తున్నది. ఇప్పుడు రూ. 100 కోట్ల విలువైన వస్త్రాలు నిల్వ ఉన్నాయి. బతుకమ్మ చీరల తయారీకి సంబంధించి రూ.250 కోట్లు ప్రభుత్వం నుంచి రావాల్సి ఉన్నది. వాటి గురించి కాంగ్రెస్ ప్రభుత్వం ఎటూ తేల్చడం లేదు. కొత్త ఆర్డర్లపై స్పష్టత ఇవ్వడం లేదు. తప్పని పరిస్థితిలో పరిశ్రమ బంద్ పెట్టినం.

- మంచె శ్రీనివాస్, వస్త్ర ఉత్పత్తిదారు, మున్సిపల్ వైస్ చైర్మన్, సిరిసిల్ల

నివేదికలు తయారుచేస్తున్నం

ప్రభుత్వ ఆదేశాల మేరకు సిరిసిల్ల వస్త్ర పరిశ్రమ సంక్షోభం, ఆర్వీఎం ఆర్డర్లపై నివేదికలు తయారుచేస్తున్నాం. విషయాన్ని చేనేత సహకార, మార్కెటింగ్‌శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు, చేనేత జౌళిశాఖ డైరెక్టర్ అలుగు వర్షిణి దృష్టికి తీసుకెళ్లాం. వారి ఆదేశాల ప్రకారం సమగ్రంగా నివేదికలు రూపొందించి పంపిస్తాం. వారం రోజుల్లో ఆర్డర్లు ఇచ్చే అవకాశం ఉంది. ఆందోళన అవసరం లేదు.

- మిట్టకోల సాగర్, చేనేత జౌళిశాఖ జిల్లా అధికారి, రాజన్న సిరిసిల్ల

వస్త్ర పరిశ్రమను కాపాడండి: కేటీఆర్

హైదరాబాద్, జనవరి 16 (నమస్తే తెలంగాణ): వస్త్ర పరిశ్రమ అభివృద్ధికి కేసీఆర్ ప్రభుత్వం చేపట్టిన వివిధ కార్యక్రమాలను కొనసాగిస్తూనే నేతన్నలు బలోపేతం అయ్యేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం మరిన్ని చర్యలు చేపట్టాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కోరారు. సిరిసిల్ల వస్త్ర పరిశ్రమ సంక్షోభంలో ఉన్నదనే వార్తలపై ఆయన మంగళవారం ఎక్స్ వేదికగా స్పందించారు. పదేండ్లలో సిరిసిల్ల వస్త్ర పరిశ్రమ ఎంతగానో అభివృద్ధి చెందిందని, ఎంతో నైపుణ్యం గల పవర్‌లూం నేతన్నలు అభివృద్ధి చెందడమే కాకుండా తమ కార్యకలాపాలను విస్తరించారని గుర్తుచేశారు. బీఆర్ఎస్ ప్రభుత్వం అందించిన సహకారమే ఇందుకు ప్రధాన కారణమని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం కూడా పవర్‌లూం వస్త్ర పరిశ్రమకు అండగా నిలవాలని కోరారు. ప్రభుత్వ సహకారం ఉంటే తమిళనాడులో ఉన్న తిరుపూరు వస్త్ర పరిశ్రమతో సమానంగా పోటీ పడే అవకాశాలు ఈ రంగానికి ఉన్నాయని తెలిపారు. గత 15 రోజులుగా వస్త్ర పరిశ్రమపై వస్తున్న వార్తలు తీవ్ర ఆందోళన కలిగిస్తున్నాయని, ప్రభుత్వం వెంటనే స్పందించకపోతే చేనేత పరిశ్రమ తీవ్ర సంక్షోభంలో చిక్కుకొనే ప్రమాదం ఉన్నదని కేటీఆర్ ఆందోళన వ్యక్తం చేశారు.

చేనేత కార్మికుడి ఆత్మహత్య

- డబ్బుల్లేక రాలేకపోయిన కుటుంబసభ్యులు
- మున్సిపాలిటీ సిబ్బందితో మృతదేహానికి అంత్యక్రియలు

సిరిసిల్ల రూరల్, జనవరి 16: ఉపాధి కరువై.. ఆరోగ్య సమస్యలు తీవ్రమై రాజన్న సిరిసిల్ల జిల్లా తంగళ్లపల్లి మండలం ఇందిరమ్మకాలనీ (టెక్స్‌టైల్‌పార్క్)లో పనిచేసే వలస చేనేత కార్మికుడు సోమవారం రాత్రి ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసుల వివరాల ప్రకారం.. ఉత్తరప్రదేశ్‌కు చెందిన చంద్రహాస్ (61)15 ఏండ్ల క్రితం సిరిసిల్లకు వలస వచ్చాడు. ఇందిరమ్మకాలనీలోని ఓ ఇంట్లో ఒంటరిగా అద్దెకు ఉంటున్నాడు. టెక్స్‌టైల్‌పార్క్‌లో వలస కార్మికుడిగా పనిచేస్తున్న చంద్రహాస్.. అక్కడి పరిశ్రమలు మూతపడటంతో ఖాళీగా ఉంటున్నాడు. కుటుంబానికి దూరంగా ఉండటం, దీర్ఘకాలిక వ్యాధులతో సతమతమవుతుండటంతో సోమవారం రాత్రి అద్దె ఇంట్లోనే ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. విషయం తెలుసుకున్న పోలీసులు గ్రామానికి చేరుకొని దర్యాప్తు చేపట్టారు. మృతదేహాన్ని సిరిసిల్ల ప్రభుత్వ దవాఖానకు తరలించి, కుటుంబసభ్యులకు సమాచారం ఇచ్చారు. అక్కడికి రావడానికి తమ వద్ద కిరాయి కూడా డబ్బులు లేవని, రాలేకపోతున్నామని చెప్పడంతో మున్సిపల్ సిబ్బందితో అంత్యక్రియలు జరిస్తామని పోలీసులు తెలిపారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

నేటి నుంచి గ్రామసభలు

- పంచాయతీరాజ్ శాఖ ఆదేశాలు

హైదరాబాద్, జనవరి 16 (నమస్తే తెలంగాణ): రాష్ట్ర వ్యాప్తంగా బుధవారం నుంచి గ్రామ పంచాయతీల్లో గ్రామ సభలు నిర్వహించాలని ప్రభుత్వం ఆదేశించింది. గ్రామ పంచాయతీల అవసరాలపై ప్రణాళికలు రూపొందించడానికి పీపుల్స్ ప్లాన్ క్యాంపెయిన్ (పీపీసీ)లో భాగంగా ఈ నెల 27 వరకు ఈ సభలను నిర్వహించనున్నారు. ఈ మేరకు పంచాయతీరాజ్ డైరెక్టర్ హన్మంతరావు జిల్లాల అదనపు కలెక్టర్లు, జడ్పీ సీఈవోలు, డీపీవోలకు మంగళవారం ఆదేశాలను జారీ చేశారు. 2023-24 సంవత్సరంలో అందుబాటులో ఉన్న నిధులతో చేపట్టే పనులు, 2024-25 ఆర్థిక సంవత్సరంలో గ్రామ అవసరాలకు ప్రాధాన్య క్రమంలో పనులను నిర్ణయించి ప్రణాళిక రూపొందించిన గ్రామ పంచాయతీ డెవలప్‌మెంట్ ప్లాన్ (జీపీడీపీ)ను గ్రామసభలో ఆమోదించాలని సూచించింది. కేంద్ర ప్రభుత్వం రూపొందించిన సబ్‌కి యోజన- సబ్‌కా వికాస్‌లో భాగంగా ఈ కార్యక్రమాన్ని రాష్ట్రం చేపట్టింది.

నష్టాలపై నివేదిక ఇవ్వండి

- చేనేత సంఘాలకు ప్రభుత్వ ఆర్డర్లు
- అధికారులకు మంత్రి తుమ్మల ఆదేశం

హైదరాబాద్, జనవరి 16 (నమస్తే తెలంగాణ): చేనేత రంగంసహా వస్త్ర పరిశ్రమల సమస్యలపై సమగ్ర విచారణ జరిపి, నష్టాల నుంచి గట్టెక్కేందుకు తీసుకోవాల్సిన చర్యలపై నివేదిక సమర్పించాలని సహకార, చేనేత, మార్కెటింగ్‌శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అధికారులను ఆదేశించారు. వస్త్ర పరిశ్రమ నష్టాల్లో కూరుకుపోవడంతో పరిశ్రమలను మూసివేయాలని యాజమాన్యాలు నిర్ణయించిన నేపథ్యంలో మంత్రి తుమ్మల సోమవారం అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కార్మికులకు ఇబ్బంది కలుగకుండా, పరిశ్రమలు మూతపడకుండా చూడాలని కోరారు. స్కూల్ యూనిఫామ్స్‌సహా ప్రభుత్వ ఆర్డర్లను వెంటనే చిన్నతరహా పరిశ్రమలు, చేనేత సహకార సంఘాలకు ఇవ్వాలని ఆదేశించారు. సమావేశంలో రాష్ట్ర చేనేతశాఖ డైరెక్టర్ అలుగు వర్షిణి, రీజినల్ డైరెక్టర్ అశోక్‌రావు తదితరులు పాల్గొన్నారు.

గోదాముల్లో పేరుకుపోయిన నిల్వలు

కొద్ది నెలలుగా పాలిస్టర్ వస్త్ర పరిశ్రమ మాంద్యం కారణంగా తీవ్ర నష్టాలపాలైంది. దీని కారణంగా ఫ్యాక్టరీల్లో ఉత్పత్తులు పెరిగి గోదాముల్లో నిల్వలు పేరుకుపోయాయి. హైదరాబాద్‌సహా వివిధ మార్కెట్లలో పాలిస్టర్ వస్త్రాల అమ్మకాలు తగ్గిపోవడంతో కార్మికులకు, వస్త్ర పరిశ్రమ అనుబంధ సభ్యులకు పని కల్పించలేక, సకాలంలో జీతాలు అందించలేక పలువురు యజమానులు తమ ఫ్యాక్టరీలను మూసివేయాలని నిర్ణయించారు. ఈ నేపథ్యంలో మంత్రి తుమ్మల సమీక్ష నిర్వహించారు.

నేటి నుంచి బీఆర్ఎస్ సమీక్షలు

- నేడు నాగర్‌కర్నూల్‌తో పునఃప్రారంభం

హైదరాబాద్, జనవరి 16 (నమస్తే తెలంగాణ): లోక్‌సభ నియోజకవర్గాల వారీగా బీఆర్ఎస్ పార్టీ నిర్వహిస్తున్న సమీక్షలు బుధవారం నుంచి పునః ప్రారంభం కానున్నాయి. ఈ నెల 3 నుంచి ప్రారంభమైన సమావేశాలు 12వ తేదీ వరకు కొనసాగాయి. సంక్రాంతి పర్వదినం నేపథ్యంలో మూడు రోజులపాటు సమావేశాలకు విరామం ఇవ్వగా, నాగర్‌కర్నూల్ నియోజకవర్గవర్గ సమీక్షతో తిరిగి ప్రారంభించనున్నారు. ఈ నెల 22న నల్లగొండ నియోజకవర్గ సమీక్షతో సమావేశాలు ముగియనున్నాయి. అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమికి దారి తీసిన పరిస్థితులపై సమీక్ష, రాబోయే లోక్‌సభ ఎన్నికలకు పార్టీ క్యాడర్‌ను సన్నద్ధం చేయడమే లక్ష్యంగా సమావేశాలు కొనసాగుతున్నాయి. ఇప్పటికే పది లోక్‌సభ నియోజకవర్గాల సన్నాహక సమావేశాలు ముగిశాయి. ఒక్కొక్క లోక్‌సభ నియోజకవర్గం నుంచి 500-600 మందిని ఆహ్వానిస్తున్నారు. లోక్‌సభ నియోజకవర్గాల సమావేశాలు ముగిసిన తరువాత అసెంబ్లీ నియోజకవర్గ స్థాయిలోనూ సమావేశాలు నిర్వహించాలని నిర్ణయించారు. వాటి షెడ్యూల్‌ను త్వరలో ప్రకటించనున్నారు.

చలి వణుకు

	కనిష్ఠం	గరిష్ఠం
రంగారెడ్డి	12.8°c	34.6°c
ఆదిలాబాద్	14.9°c	33.4°c
మెదక్	15.2°c	33.2°c
నిజామాబాద్	17.7°c	31.5°c
ఖమ్మం	18.0°c	30.0°c
నల్లగొండ	19.0°c	34.1°c
వరంగల్	19.0°c	31.0°c
కరీంనగర్	19.0°c	31.0°c
హైదరాబాద్	19.5°c	31.2°c
మహబూబ్‌నగర్	20.0°c	31.5°c

ఢిల్లీలో కేంద్ర మంత్రి పీయూష్ గోయల్ నుంచి అవార్డు అందుకుంటున్న శాంతా తౌటం, ఎంఎస్ రావు

స్టార్టప్ ర్యాంకింగ్ తెలంగాణ

మొదటిపేజీ తరువాయి...

స్టార్టప్ ర్యాంకింగ్స్‌లో తెలంగాణ ప్రథమ స్థానంలో నిలిచింది. పటిష్ఠమైన స్టార్టప్ పర్యావరణ వ్యవస్థను పెంపొందించడంలో బీఆర్ఎస్ ప్రభుత్వం చూపిన తొరవ, తెగువకు ఈ ర్యాంకు తార్కాణం. మంగళవారం ఢిల్లీలో జరిగిన కార్యక్రమంలో కేంద్ర వాణిజ్యం, పరిశ్రమలు, వినియోగదారుల వ్యవహారాల శాఖల మంత్రి పీయూష్ గోయల్ చేతులమీదుగా తెలంగాణ స్టేట్ ఇన్నోవేషన్ సెల్ సీఐఈ డాక్టర్ శాంతా తౌటం, టీ హబ్ సీఈవో ఎంఎస్ రావు 'స్టేట్ స్టార్టప్ ర్యాంకింగ్స్-2022' అవార్డును అందుకున్నారు. ఈ సందర్భంగా తెలంగాణ ఐటీ శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ జయేశ్‌రంజన్ మాట్లాడుతూ డీపీఐఐటీ నిర్వహించిన స్టేట్ స్టార్టప్ ర్యాంకింగ్స్-2022లో తెలంగాణ మొదటిస్థానంలో నిలువటం రాష్ట్రంలో అభివృద్ధి చెందుతున్న పర్యావరణ వ్యవస్థకు నిదర్శనమని పేర్కొన్నారు. రాష్ట్రంలో స్టార్టప్‌లను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం ఎన్నో విప్లవాత్మక నిర్ణయాలు తీసుకొని పట్టణాల నుంచి గ్రామీణ ప్రాంతాలవరకు ఆవిష్కర్తలను ప్రోత్సహించిందని తెలిపారు. అభివృద్ధి చెందుతున్న సాంకేతికతలను సమర్థంగా వినియోగించేలా కార్యక్రమాలను ఏడాది పొడవునా నిర్వహించామని చెప్పారు. టీ హబ్ కేంద్రంగా జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో స్టార్టప్‌లు కార్యకలాపాలను విస్తరించాయని పేర్కొన్నారు. నిరంతరం స్టార్టప్‌లను ప్రోత్సహించేందుకు టీ హబ్ మాత్రమే కాకుండా టీఎస్ఐసీ, టీ వర్క్స్, వీ హబ్, రిచ్, టాస్క్ వంటి సంస్థలను రాష్ట్రంలో ఏర్పాటు చేశామని గుర్తుచేశారు. అన్ని సంస్థల ప్రతినిధులు సమర్థవంతంగా పనిచేయడం వల్లే జాతీయ స్థాయిలో తెలంగాణకు ఈ అవార్డు వచ్చిందని తెలిపారు.

తెలంగాణపై కేసీఆర్ ముద్ర

- అందరూ గర్వపడేలా పల్లెల అభివృద్ధి
- పదేండ్లలోనే 81 అవార్డులు సాధించాం
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్
- సిరిసిల్లలో విస్తృత పర్యటన

రగుడులో రామలక్ష్మణపల్లె సర్పంచ్ రవీందర్‌రెడ్డి దంపతులను సన్మానిస్తున్న మాజీ మంత్రి కేటీఆర్

రాజన్న సిరిసిల్ల, జనవరి 16 (నమస్తే తెలంగాణ): 'ఒకప్పుడు తెలంగాణ పల్లెలంటే పాడుబడ్డ బావులు, పాత గోడలు, చెత్త కుప్పలు, మట్టి దిబ్బలు. తెలంగాణ వచ్చినంక పల్లె ముఖచిత్రమే మారిపోయింది. తెలంగాణ బిడ్డలు గర్వపడేలా పల్లెల అభివృద్ధి జరిగింది' అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ అన్నారు. దశాబ్దాలపాటు దగాపడ్డ తెలంగాణ దర్జాగా కాలర్ ఎగిరేసిందంటే సర్పంచుల పనితీరు వల్లేనని కొనియాడారు. నాడు సమస్యల సుడిగుండంలో కొట్టుమిట్టాడిన పల్లెలను, నేడు సకల సౌకర్యాల హరివిల్లులుగా మార్చిన ఘనత మనదేనని పేర్కొన్నారు. మాజీ ఎంపీ బీ వినోద్‌కుమార్‌తో కలిసి కేటీఆర్ మంగళవారం సిరిసిల్ల జిల్లాలో పర్యటించారు. రగుడు వద్ద తెలంగాణ భవన్‌లో నిర్వహించిన సర్పంచుల ఆత్మీయ సత్కారానికి హాజరై మాట్లాడారు. 'రాష్ట్రంలోని అన్ని గ్రామాలు ఓడీఎఫ్ ప్లస్ కలిగిన ఏకైక రాష్ట్రంగా తెలంగాణను నిలిపిన సర్పంచులకు కేటీఆర్ కృతజ్ఞతలు తెలిపారు.

జాతీయ స్థాయి అవార్డుల్లో మనమే టాప్

కేసీఆర్ ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలతో 2014 నుంచి ఇప్పటివరకు తెలంగాణకు 81 అవార్డులు వచ్చినట్టు కేటీఆర్ తెలిపారు. దేశంలో 3 శాతం కన్నా తక్కువ జనాభా ఉన్న తెలంగాణకు జాతీయ స్థాయిలో 35 శాతం అవార్డులు రావడం గర్వించదగ్గ విషయమని అన్నారు. సంసద్ ఆదర్శ గ్రామీణ యోజనలో టాప్‌టెన్‌లో పదికి పది అవార్డులు, ఇరవైలో 19 అవార్డులు తెలంగాణకే దక్కడం సర్పంచుల పనితీరుకు నిదర్శమని పేర్కొన్నారు.

పదవులు శాశ్వతం కాదు: వినోద్‌కుమార్

పదవులు శాశ్వతం కాదని, చేసిన పనులతో మన పేరు సమాజంలోని ప్రతి ఒక్కరి గుండెల్లో చిరస్థాయిగా నిలిచి పోతుందని మాజీ ఎంపీ వినోద్‌కుమార్ పేర్కొన్నారు. కేసీఆర్ ప్రభుత్వంలో పనిచేసిన సర్పంచులు అదృష్టవంతులని కొనియాడారు. సమావేశంలో బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య, పట్టణాధ్యక్షుడు జిందం చక్రపాణి, జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ న్యాలకొండ అరుణ, సెస్ చైర్మన్ చిక్కాల రామారావు పాల్గొన్నారు.

ఎదురుదెబ్బలు సహజం

చందుర్తి, జనవరి 16: జీవితమైనా, రాజకీయమైనా ఎదురు దెబ్బలు సహజమని కేటీఆర్ పేర్కొన్నారు. చందుర్తి మండలం మల్యాలలో కేసీఆర్ కప్ వాలీబాల్ టోర్నీని ప్రారంభించి, మాట్లాడారు. రాజకీయాల్లో గెలుపోటములు సమానంగా స్వీకరించే సత్తా ఉండాలని అన్నారు. ఈ సందర్భంగా గ్రామానికి చెందిన ఈర్లపల్లి నారాయణ కేటీఆర్‌ను చూసి భావోద్వేగానికి లోనై 'నాన్న ఎలా ఉన్నా రు?' అని అడిగి కన్నీటి పర్యంతం కాగా, కేటీఆర్ ఓదార్చారు.

నిపుణ — విద్య, ఉద్యోగ సమాచారం

ఏఏఐలో...

ఎయిర్‌పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా (ఏఏఐ)లో కింది పోస్టుల భర్తీకి ప్రకటన విడుదలైంది.

- మొత్తం ఖాళీలు: 119
- పోస్టులు: జూనియర్ అసిస్టెంట్, సీనియర్ అసిస్టెంట్
- విభాగాలు: ఫైర్ సర్వీసెస్, ఆఫీస్ తదితరాలు
- దరఖాస్తు: ఆన్‌లైన్‌లో
- చివరితేదీ: జనవరి 26
- వెబ్‌సైట్: https://www.aai.aero.

ఐఐటీఎంలో ఎంబీఏ

చెన్నైలోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఐఐటీఎం)లో కింది ప్రోగ్రామ్‌లో ప్రవేశాల కోసం ప్రకటన విడుదలైంది.

- ప్రోగ్రామ్: ఎంబీఏ
- కోర్సు కాలవ్యవధి: రెండేండ్లు (ఫుల్‌టైం)
- ఎంపిక, ఫీజు తదితరాల కోసం వెబ్‌సైట్ చూడవచ్చు
- దరఖాస్తు: ఆన్‌లైన్‌లో
- చివరితేదీ: జనవరి 31
- వెబ్‌సైట్: https://doms.iitm.ac.in

సైంటిస్ట్ పోస్టులు

సీఎస్ఐఆర్-సెంట్రల్ గ్లాస్ అండ్ సిరామిక్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్‌లో కింది ఖాళీల భర్తీకి ప్రకటన విడుదలైంది.

- మొత్తం ఖాళీలు: 12
- పోస్టులు: సైంటిస్ట్
- దరఖాస్తు: ఆన్‌లైన్‌లో
- చివరితేదీ: జనవరి 24
- వెబ్‌సైట్: www.cgcri.res.in

ఆన్‌లైన్‌లో స్టడీ మెటీరియల్

పోటీ పరీక్షల ప్రత్యేకం

- జాగ్రఫీ, ఫిజిక్స్, ఎకానమీ కోసం పై క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి.

తెలంగాణలో తగ్గిన పేదరికం

మొదటిపేజీ తరువాయి...

భారతదేశంలోనే ఉండటం విశేషం.

తెలంగాణలో అనూహ్య మార్పు

కేంద్ర ప్రభుత్వ నివేదికల ప్రకారం 2013-14లో తెలంగాణ ప్రాంతంలో పేదరికం 21.92 శాతంగా ఉండేది. ఇది అప్పటి జాతీయ సగటు కన్నా ఎక్కువ. ప్రతి వంద మందిలో 22 మంది పేదరికంలో మగ్గారు. నీతి ఆయోగ్ తాజా నివేదిక ప్రకారం తెలంగాణలో పేదరికం 2022-23 నాటికి 3.76 శాతానికి తగ్గింది. అంటే కేసీఆర్ పాలనలో తొమ్మిదేండ్లలోనే 82.85 శాతం పేదరికం పోయింది. బీఆర్ఎస్ ప్రభుత్వం తీసుకున్న చర్యల ఫలితంగా తొమ్మిదేండ్లలో ప్రతి వంద మంది పేదల్లో 83 మంది పేదరికం నుంచి బయటపడినట్టు తెలుస్తున్నది. రాష్ట్రం ఏర్పడే నాటికి జాతీయ సగటు కన్నా అధికంగా పేదరికంలో ఉన్న తెలంగాణలో నేడు మూడోంతులు తక్కువగా నమోదైంది. తద్వారా దేశంలో అతి తక్కువ పేదలున్న పెద్ద రాష్ట్రాల్లో మూడో స్థానంలో నిలిచింది. కేరళ (0.48%), తమిళనాడు (1.43%) మొదటి రెండు స్థానాల్లో నిలిచాయి. టాప్-3 రాష్ట్రాలన్నీ దక్షిణాదికి చెందినవే కావడం గమనార్హం.

- దేశంలోనే అత్యధికంగా బీహార్‌లో 26.59 శాతం మంది పేదరికంలో ఉన్నారు. ఆ తర్వాత జార్ఖండ్‌లో 23.34 శాతం పేదరికం ఉన్నది. మూడో స్థానంలో ఉత్తరప్రదేశ్ (17.40 శాతం) నిలిచింది.
- ప్రధాని సొంత రాష్ట్రం గుజరాత్‌లో 9.03 శాతం మంది పేదలు ఉన్నట్టు నివేదిక స్పష్టం చేసింది.

అతి తక్కువ పేదలున్న రాష్ట్రాలు

కేరళ	0.48%
తమిళనాడు	1.43%
తెలంగాణ	3.76%

అత్యధికంగా పేదలున్న రాష్ట్రాలు

బీహార్	26.59%
జార్ఖండ్	23.34%
ఉత్తరప్రదేశ్	17.40%
గుజరాత్	9.03%

కేసీఆర్ పాలన వల్లే..

మాజీ సీఎం కేసీఆర్ నేతృత్వంలోని రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న చర్యల ఫలితంగానే రాష్ట్రంలో పేదరికం అనూహ్యంగా తగ్గిందని ఆర్థిక, రాజకీయ నిపుణులు స్పష్టం చేస్తున్నారు. రాష్ట్రం ఏర్పడినప్పుడు విద్యుత్తు మొదలు అనేక సమస్యలు ఉండేవని, కేసీఆర్ పాలనలో ఒక్కొక్కటి పరిష్కారం అయ్యాయని గుర్తు చేస్తున్నారు. దీంతోపాటు ఓవైపు సంక్షేమం, మరోవైపు అభివృద్ధికి సమ ప్రాధాన్యం ఇస్తూ చేపట్టిన సంస్కరణలు, తీసుకొచ్చిన పథకాల ఫలితంగా ప్రజలు ఆర్థికంగా బలపడ్డారని చెప్తున్నారు. రాష్ట్ర జీఎస్డీపీ రూ.4.51 లక్షల కోట్ల నుంచి మూడున్నర రెట్లు పెరిగి రూ.13.27 లక్షల కోట్లకు చేరిందని గుర్తు చేస్తున్నారు. తలసరి ఆదాయం రాష్ట్రం ఏర్పడినప్పుడు రూ.1.12 లక్షలు ఉండగా, ఇప్పుడు దాదాపు మూడు రెట్లు పెరిగి రూ.3.17 లక్షలకు పెరిగిందన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం తొమ్మిదిన్నరేండ్లలో వసతుల కల్పన, పథకాలు, ప్రాజెక్టుల అమలు వంటివాటికోసం సుమారు రూ.13 లక్షల కోట్లు వ్యయం చేసిందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ ఇటీవల స్వేదపత్రంలో పేర్కొన్న విషయాన్ని గుర్తు చేస్తున్నారు. ఓవైపు పెట్టుబడులు, మరోవైపు పంట ఉత్పత్తులు, మరోవైపు సంక్షేమ పథకాల కారణంగా పేదరికం తగ్గిందని స్పష్టం చేస్తున్నారు.

గర్వంగా ఉన్నది : కేటీఆర్

తెలంగాణలో పేదరికం గణనీయంగా తగ్గిందని నీతి ఆయోగ్ నివేదిక చెప్పడం గర్వంగా ఉన్నదని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పేర్కొన్నారు. ఈ మేరకు మంగళవారం ట్వీట్ చేశారు. 'చాలా గర్వంగా ఉన్నది. గత దశాబ్దంలో తెలంగాణ ఎంత బాగా ఎదిగిందో నివేదిక రూపంలో తెలియజేసినందుకు నీతి ఆయోగ్‌కు ధన్యవాదాలు' అని కేటీఆర్ ట్వీట్ చేశారు.

ఎస్సీ వర్గీకరణపై అఫిడవిట్ దాఖలు చేయాలి

- దళితబంధు అకౌంట్ల ఫ్రీజింగ్ ఎత్తేయాలి
- ఎస్సీ వర్గీకణపై బీజేపీ మాటలు నమ్మలేం
- స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం

హనుమకొండ, జనవరి 16: ఎస్సీ వర్గీకరణను సమర్థిస్తూ తక్షణమే సుప్రీం కోర్టులో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అఫిడవిట్ దాఖలు చేయాలని స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి డిమాండ్ చేశా రు. ఎస్సీ వర్గీకరణ, దళితబంధు అమలుపై వరంగల్ ఎంపీ పసునూరి దయాకర్, జడ్పీ చైర్మన్ సుధీర్‌కుమార్‌తో కలిసి మంగళవారం ఆయన హనుమకొండ నక్కలగుట్టలోని హరిత కాకతీయ హోటల్‌లో మీడియాతో మాట్లాడారు. ఎస్సీ వర్గీకరణపై బీజేపీ మాటలు నమ్మలేమ ని, ఆ పార్టీకి చిత్తశుద్ధి ఉంటే పార్లమెంట్‌లో చట్టం తీసుకురావాలని డిమాండ్ చేశారు. కేసీఆర్ ప్రభుత్వం రాష్ట్రంలో దళితుల అభ్యున్నతి కోసం దళితబంధు ప్రారంభించిందని వివరించారు. ఎన్నికల కోడ్ నేపథ్యంలో లబ్ధిదారుల ఖాతాలను ఫ్రీజ్ చేశారని, ఈ ఫ్రీజింగ్‌ను వెంటనే ఎత్తివేయాలని కోరారు. రెండో విడతలో కలెక్టర్ల ద్వారా ఎంపికైన లబ్ధిదారులకు దళితబంధు పథకం కొనసాగించాలని ప్రభుత్వానికి సూచించారు.

కమిటీల పేరుతో బీజేపీ వంచన: వంగపల్లి

ముషీరాబాద్, జనవరి 16: కమిటీల పేరుతో కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం మాదిగలను మోసం చేస్తున్నదని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు వంగపల్లి శ్రీనివాస్‌మాదిగ విమర్శించారు. అధికారంలోకి వస్తే వంద రోజుల్లో ఎస్సీ వర్గీకరణ చేస్తామని మాయమాటలు చెప్పి మళ్లీ కమిటీలంటూ కాలయాపనకు ప్రయత్నిస్తున్నదని మండిపడ్డారు. హైదరాబాద్‌లోని విద్యానగర్ సంఘం రాష్ట్ర కార్యాలయంలో మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడారు. పార్లమెంటు ద్వారానే వర్గీకరణ సాధ్యమని చెప్తూ వస్తున్న మంద కృష్ణమాదిగ వర్గీకరణ అంశాన్ని పక్కదారి పట్టించేలా సుప్రీంకోర్టులో కేసు ఉన్నదంటూ ప్రభుత్వానికి వంతపాడుతున్నారని ఆరోపించారు. మంద కృష్ణ వైఖరి వల్లే వర్గీకరణ జాప్యం జరుగుతున్నదని విమర్శించారు. ఈ నెల 31న జరిగే చివరి పార్లమెంటు సమావేశాల్లో వర్గీకరణ బిల్లు ప్రవేశపెట్టాలని డిమాండ్ చేశారు.